క్లుప్తంగా

సకాలంలో విధులకు హాజరు కావాలి



లోగిశ సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ నిర్మలాదేవి

గజపతినగరం: గ్రామ సచివాలయాల ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరవుతూ ప్రజలకు సక్రమంగా సేవలందించాలని డీఎల్‌డీఓ జి.ఎస్. నిర్మలాదేవి సూచించారు.మండలంలోని తుమికాపల్లి, లోగిశ గ్రామ సచివాలయాల్లో మంగళవారం ఆమె తనిఖీలు నిర్వహించారు. రికార్డుల ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట ఎంపీడీఓ కిశోర్‌కుమార్ ఉన్నారు.

పరామర్శ



పొట్టమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు

శృంగవరపుకోట: మండలంలోని అమ్మపాలెం గ్రామానికి చెందిన సింబోని చిన్న అనే వైఎస్సార్‌సీపీ కార్యకర్త తల్లి పొట్టమ్మ అనారోగ్యంతో ఇటీవల మరణించింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చిన్న కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, బొడ్డవర సర్పంచ్ దేవాపురపు మీనా, పోతనాపల్లి సర్పంచ్ కె.వెంకటరావు, నాయకులు వాకాడ రాంబాబు,సాంబరాజు, సన్యాసిదేముడు, బాబూరావు, అప్పారావు, శంకర్, అచ్చింనాయుడు, ఎం.సూర్యనారాయణ, కేత వీరన్న పరామర్శించిన వారిలో ఉన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీఓ నాగమణి, ఝాన్సీరాణి

గజపతినగరం: బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు తెలియజేసి, వాటిని పూర్తిస్థాయిలో అరికట్టాలని ఐసీడీఎస్ పీఓ నాగమణి, ఎన్‌జీఓ జిల్లా కో–ఆర్డినేటర్ జి.ఝాన్సీరాణి అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో ప్రాజెక్ట్ పరిధి అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా బాల్య వివాహాలు జరిపినా, ప్రోత్సహించినా వాటిని అడ్డుకోవాలని, వెంటనే తమకు కానీ పోలీసులకు కానీ సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆడపిల్లలకు 18 ఏళ్ల వయసు నిండే వరకు వివాహం చేయకూడదని, వారిని చదివించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

పక్కాగా మెనూ అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ జగదీశ్వరరావు

వేపాడ: ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ పక్కాగా అమలు చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన, రుచికర మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ జగదీశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో హెచ్‌ఎంలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ వంటల చేసే ప్రాంతం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, విద్యార్థులు తాగడానికి వేడినీరు అందించాలని సూచించారు. శిథిలావస్థకు చేరి విడిచిపెట్టేసిన పాఠశాలల భవనాల్లోకి విద్యార్థులు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన దబ్బిరాజుపేట హెచ్‌ఎం శంకరరావును ఎంఈఓలు జగదీశ్వరరావు, బాలభాస్కరరావు అభినందించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వేపాడ: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని నీలకంఠరాజపురం క్లస్టర్ పరిధి అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా నీలకంఠరాజపురంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై మంగళవారం అవగాహన కల్పించారు. గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకుంటే పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. పిల్లలకు ఆరునెలల వయసు వచ్చే వరకు తల్లిపాలే పట్టాలని బాలింతలకు సూచించారు. ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు.

• జ్వరాలపై ఇంటింటి సర్వే



వీరభద్రపురంలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

కొత్తవలస: మండలంలోని ముసిరాం,వీరభద్రపురం, అప్పన్నపాలెం, ఉత్తరాపల్లి, రామలింగాపురం గ్రామాల్లో వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది మంగళవారం ఇంటింటి ఫీవర్ సర్వే చేశారు. జ్వరలక్షణాలు ఉన్న వారికి మందులు అందజేసి జాగ్రత్తలు చెప్పారు. వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాలు కారణంగా నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. మాంసం, చేపలు, గోంగూర, బిర్యానీ వంటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

• సాగులో డ్రోన్ సాయం



డ్రోన్‌తో పురుగు మందు పిచికారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

గజపతినగరం: వ్యవసాయంలో రైతులు ఆధునిక పద్ధతులు పాటించాలని గజపతినగరం వ్యవసాయశాఖ ఏడీఏ కె.మహారాజన్ సూచించారు. మండలంలోని శ్రీరంగరాజ పురం గ్రామంలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. డ్రోన్ ద్వారా పంటలకు పురుగు మందులు పిచికారీ చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. ఏడీఏ మాట్లాడుతూ డ్రోన్‌లతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంటకు పురుగు మందులు,పోషకాలు పిచికారీ చేసుకోవచ్చని, పురుగు మందు వృథా కాదన్నారు. పంటను ఆశించే చీడ,పీడలను రైతులు సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఏఓ సీహెచ్.ధనలక్ష్మి, వీఏఏ వినయ్‌కుమార్, ఎఫ్‌పీఓ చైర్మన్ భారతి పాల్గొన్నారు.

ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే

• మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



బొత్స అప్పలనరసయ్య

దత్తిరాజేరు: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంతో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆరోపించారు. మంగళ వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయవాడకు వరదలు వస్తాయని ముందే సమాచారం ఉన్నప్పటికీ ప్రజలను ప్రభుత్వం అప్రమత్తం చేయలేదని, లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావా కేంద్రాలకు తరలించలేదని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల సుమారు 50 మంది ప్రాణాలు కోల్పోయారని, బాధితులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వ పెద్దలు జేసీబీలు,బోట్లు ఎక్కి ఫొటోలు దిగారే తప్ప ప్రజలను ఆదుకున్న దాఖలాలు లేవని అన్నారు.విపత్తులు సంభవించినప్పుడు ప్రజల పక్షాన ఉండాల్సిన ప్రభుత్వ పెద్దలు వారి వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే చూస్తున్నారని అన్నారు. ప్రధాన మీడియా, సోషల్ మీడియా, పలు స్వచ్ఛంద సంస్థల వద్ద బాధితులు తమ గోడు వెళ్లబోసుకునే పరిస్థితి రావడం దారుణమన్నారు. వర్షాల వల్ల జరగనున్న ముప్పును అధికారులు ముందుగానే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా నష్ట నివారణ చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహించారని మండిపడ్డారు. బాధితులకు ఆహారం, మందులు అందివ్వడంతో పాటు సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంద న్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇల్లు, ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ యాక్టివ్ పవర్ ప్లాంట్ మునిగిపోకుండా కాపాడేందుకే బుడమేరు నుంచి నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడ మీదకు వదిలేశారని ఆరోపించారు.జలదిగ్బంధంలో ఉన్న వారిని బోట్లు, పడవల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించలేకపోయారని మండిపడ్డారు. రాష్ట్ర రాజధానిగా చెప్పుకుంటున్న ప్రాంతంలో తొమ్మిది రోజుల పాటు ప్రజలు నరకయాతన అనుభవించారంటే ప్రభుత్వం ఎంత ఘోరంగా విఫలమైందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, వరదలు వచ్చే సమయంలో వాతావరణ శాఖ,నీటి పారుదల విభాగం ప్రభుత్వానికి ముందుగానే తెలియజేస్తాయని, వారి హెచ్చ రికలను ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. వరదలు వచ్చిన తర్వాత ప్రజలు తమకు తాముగానే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లే ప్రయత్నం చేశారని, ఈక్రమంలో కొందరు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని అన్నారు. ముంపు ప్రాంతాల్లో రెండో అంతస్తుల్లో ఉన్న వారికి ప్రభుత్వం ఆహారం , తాగునీరు, పాలు అందించలేకపోయారని, వరద నీరు లేని ప్రాంతాల్లో అరకొరగా అందజేశారని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా వరద బాధితులకు భరోసా కల్పించాలని కోరారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



దత్తిరాజేరు: గర్భిణులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ స్రవంతి



వేపాడ: పీహెచ్‌సీలో గర్భిణులకు సత్యసాయి సమితి సమకూర్చిన అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న డాక్టర్ ఫణిశ్రీ

వేపాడ: ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 48 మంది గర్భిణులకు వైద్యాధికారి ధరణి, గైనకాలజిస్టు ఫణిశ్రీ మంగళవారం వైద్య పరీక్షలు చేశారు. హైరిస్క్ గర్భిణులకు జాగ్రత్తలు సూచించారు. క్రమం తప్పకుండా వైద్య తనిఖీలు చేయించుకోవాలని గర్భిణులకు సూచించారు. బానాది సత్యసాయి సేవా సమితి సమకూర్చిన అన్నప్రసాదాన్ని గర్భిణులకు అందజేశారు.సీహెచ్‌ఓ ఆంజనేయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి

దత్తిరాజేరు: గర్భిణులు నెల నెలా క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయిచుకోవాలని కె.కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి స్రవంతి సూచించారు. ప్రధాన మంత్రి సురక్ష మాతృ త్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 37మంది గర్భిణులకు మంగళవారం వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆకు కూరలు, కాయగూరలు, పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు.

17న మండల సర్వసభ్య సమావేశం

చీపురుపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల17న ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ అధ్యక్షతన నిర్వహించను న్నట్లు ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

వరద బాధితులకు సాయం



హెచ్‌ఎంకు నగదు అందజేస్తున్న విద్యార్థులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని చుక్కవలస ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులు విజయవాడ వరద బాధితులకు తమ వంతు సహాయం అందించా రు. విద్యార్థులంతా కలిసి రూ.2100 సేకరించారు. నగదును సీఎం సహాయ నిధికి పంపించాలని హెచ్‌ఎంకు అందజేశారు.

సంత మానటరింగ్ కమిటీ సమావేశం వాయిదా



సమావేశమైన మానటరింగ్ కమిటీసభ్యులు

జామి: మండలంలోని అలమండ గ్రామ సంత నిర్వహణకు లైసెన్స్ పునరుద్ధరణ కోసం లొట్లపల్లి సచివాలయంలో సర్పంచ్ జన్నేల సింహాచలం అధ్యక్షతన, ఈఓపీఆర్డీ శ్రీదేవి ఆధ్వర్యంలో సంత మానటరింగ్ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. తహసీల్దార్ కృష్ణలత, అలమండ పశువైద్యాధికారి నరేష్ కుమార్, ఏపీ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ, పలువురు సభ్యులు మాత్రమే హాజరయ్యారు. ఎస్‌ఐ, వెహికల్ ఇన్ స్పెక్టర్, ఏఎంసీ కార్యదర్శి, ఇతర సభ్యులు హాజరు కాకపోవడంతో సమావేశాన్ని ఈనెల 17వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఈఓపీఆర్డీ ప్రకటించారు.

తప్పులు లేని ఓటర్ల జాబితాయే లక్ష్యం



గజపతినగరం: పురిటిపెంటలో సర్వే చేస్తున్న ఈఆర్‌ఓ ప్రమీలా గాంధీ, అధికారులు

బొండపల్లి/ గజపతినగరం: తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీ, 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఇంటింటి సర్వే చేపడుతున్నామని గజపతినగరం నియోజకవర్గ ఈఆర్‌ఓ ప్రమీలా గాంధీ తెలిపారు. బొండపల్లి మండలంలోని దేవుపల్లి గ్రామంలో, గజపతినగరం మండలంలోని గజపతినగరం, పురిటిపెంట,గంగచోళ్లపెంట గ్రామాల్లో బీఎల్‌ఓలు మంగళవారం చేపట్టిన సర్వేను ఆమె పరిశీలించారు.ఓటర్ల జాబితా తీసుకుని ఇంటింటికీ వెళ్లి ఆ ఇంటిలో ఉన్న ఓటర్ల పేర్లు, ఫొటోలు, చిరునామా సరిగా ఉన్నదీ లేనిది, ఆ కుటుంబ ఓటర్లు అంతా ఒకే పోలింగ్ బూత్ పరిధిలో ఉన్నారా లేదా అని పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన వారితో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేయించాలని, మరణించిన ఓటర్ల వివరాలను జాబితా నుంచి తొలగించాలని బీఎల్‌ఓలకు ఈఆర్‌ఓ సూచించారు. ఓటర్ల పేర్లు, చిరునామా తప్పుగా నమోదు అయితే సరిదిద్దాలని, ఒకే కుటుంబా నికి చెందిన ఓటర్లకు వేర్వేరు పోలింగ్ బూత్‌ల్లో ఓట్లు ఉంటే వారందరిని ఒకే కేంద్రం పరిధిలోకి తీసుకురావాలని చెప్పారు. గజపతినగరం ఎలక్షన్ డీటీ కోనేటి సతీష్, బొండపల్లి ఆర్‌ఐ పి.సతీష్, సీనియర్ సహాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కరించాలని వినతి

కొత్తవలస: మండల కేంద్రంలో మురుగు సమస్యను పరిష్కరించాలని సీపీఐ ఆధ్వర్యంలో సాయి దుర్గ ఆటో డ్రైవర్స్ యూనియన్ వారు తహసీల్దార్ నీలకంఠరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆటో యూనియన్ మాట్లాడుతూ స్థానిక మార్కెట్ మీదుగా కోటపాడు రోడ్డులో మురుగు నీరు పారుతుండడంతో స్థానికులు, ప్రయాణికులు, ఇబ్బందులు పడుతున్నారని, మురుగునీటి మళ్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కొత్తవలస–విజయనగరం రోడ్డులో గిడిజాల జంక్షన్ వద్ద రోడ్డు గోతులు తేలి అధ్వానంగా తయారైందని, సంబంధిత అధికారులతో చర్చించి మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేశారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు



గజపతినగరం: మహిళా పోలీసులకు సూచనలు చేస్తున్న సీఐ జి.ఏ.వి.రమణ



బొండపల్లి: మాట్లాడుతున్న ఎస్‌ఐ మహేష్

గజపతినగరం: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, గొడవలు సృష్టించినా సంబంధిత వ్యక్తులపై చర్యలు తప్పవని స్థానిక సీఐ జి.ఏ.వి.రమణ హెచ్చరించారు. మండలంలోని సచివాలయ మహిళా పోలీసుల తో స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూడాల ని, ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వెంటనే తమకు సమాచారం అందజేయాలని సూచించారు. ఎస్‌ఐ కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

నిఘా పెట్టాలి

బొండపల్లి: గ్రామాల్లో గంజాయి, మత్తు పదార్థాల రవాణా, వినియోగంపై నిఘా పెట్టాలని సచివాలయ మహిళా పోలీసులకు ఎస్‌ఐ యు. మహేష్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని 17 సచివాలయాల్లో పని చేస్తున్న మహిళా పోలీసులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో వినాయక నిమజ్జన ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మహిళా పోలీసులపై ఉందన్నారు. వినాయక నిమజ్జనానికి సంబంధించి పూర్తి వివరాలు కమిటీ సభ్యులు పోలీసులకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ కీర్తి

బొండపల్లి: నెలివాడ గ్రామంలో 2023–2024 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ నివేదికలపై సర్పంచ్ తాళ్లపూడి కీర్తి అధ్యక్షతన మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో చేపట్టిన పనులు, వేతనదారులకు చెల్లించిన వేతనాలు, తదితర అంశాలను డీఆర్పీలు సభకు వివరించారు. వేతనదారులకు ఏమైనాఅభ్యంతరాలు ఉంటే గ్రామసభ దృష్టికి తీసుకురావచ్చని సర్పంచ్ సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

సొంత నిధులతో జంగిల్ క్లియరెన్స్ పనులు



మెట్టపల్లి- సంకుపాలెం మధ్య తుప్పలు తొలగించే పనులను పర్యవేక్షిస్తున్న శ్రీనివాసనాయుడు, గ్రామ పెద్దలు

చీపురుపల్లి: మండలంలోని అలజంగి, మెట్టపల్లి, సంకుపాలెం, కరకాం గ్రామాల రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలు, డొంకలు తొలగింపు పనులను జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, ఆమె భర్త వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తమ సొంత నిధులతో మంగళవారం చేయించారు. జేసీబీతో రోడ్డుకు ఇరువైపు లా తుప్పలు, డొంకలు తొలగించి, శుభ్ర పరిచి వాహన చోదకులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నా రు. వాస్తవానికి ఆర్‌అండ్‌బీ అధికారులు ఈ పనులు చేపట్టాల్సి ఉంది. కానీ అధికారులు పనులు చేపట్టకపోవడంతో అలజంగి, సంకుపాలెం, మెట్టపల్లి, కరకాం, గత్సలవలస, పెదనడిపల్లి, చిననడిపల్లి గ్రామాల ప్రజలు, వాహన చోదకులు సమస్యను జెడ్పీటీసీ దంపతులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు స్పందించి పనులు చేయించారు.

క్షయపై అవగాహన



పోతనాపల్లి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా టీబీ అధికారి రాణి

శృంగవరపుకోట: క్షయ వ్యాధిని సకాలంలో గుర్తించి, క్రమం తప్పకుండా మందులు వాడితే పూర్తిగా నయమవుతుందని జిల్లా లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ కె.రాణి చెప్పారు. పోతనాపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన 104 ఎఫ్‌డీపీ సర్వైలెన్స్ కార్యక్రమాన్ని కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారి జె.హారికతో కలిసి పరిశీలించారు. రికార్డులు పరిశీలించిన అనంతరం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, కఫంతో రక్తం పడుతుండడం వంటివి క్షయ లక్షణాలని, ఈ లక్షణాలు ఉంటే కొట్టాం పీహెచ్‌సీకి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు అందజేస్తామని చెప్పారు. అలాగే బీసీజీ వాక్సిన్‌పై అవగాహన కల్పించారు. ఇంటింటి ఫీవర్ సర్వేలో ఎవరైనా డయేరియా లక్షణాలు ఉన్న వారు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి తరలించి వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. ఫోటోరైటప్ :

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



చీపురుపల్లి: పట్టణంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్



చీపురుపల్లి: పట్టణంలోని ఓ వీధిలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది



గుర్ల: కవలచర్లలోని ఓ వీధిలో బ్లీచింగ్ చల్లిస్తున్న సర్పంచ్ యడ్ల గోపి



శృంగవరపుకోట: ఎస్.కోటలో కుళ్లకోనేరు పూడిక తీత పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చీపురుపల్లి: స్థానిక మేజర్ పంచాయతీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్ పర్యవేక్షణలో మంగళవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. నాలుగు రోజులుగా వర్షాల కారణంగా వీధి కాలువలు పొంగిపొర్లడంతో కాలువల్లోని చెత్త, చెదారం రోడ్లపై చేరింది. వీధులు, కాలనీలు, వార్డుల్లో పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తొలగించి, ట్రాక్టర్ల ద్వారా చెత్త శుద్ధి నిర్వహ ణ కేంద్రానికి తరలించారు. దోమల నివారణకు మలాథియన్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు.

కలవచర్లలో...

గుర్ల: మండలంలోని కలవచర్లలో సర్పంచ్ యడ్ల గోపి మంగళవారం పారిశుద్ధ్య పనులు చేయించారు. వీధి కాలువల్లో పూడిక ను పారిశుద్ధ్య కార్మికులు తొల గించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో బ్లీచింగ్ చల్లారు. వర్షాలకు గ్రామంలో తాగునీరు కలుషి తం కావడంతో వేరే గ్రామాల నుంచి ట్యాంకుల ద్వారా నీటిని తీసుకువచ్చి ప్రజలకు సరఫరా చేస్తున్నారు. పారిశుద్ధ్య పనులను పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షించారు.

కుళ్లకోనేరులో పూడిక తీత

శృంగవరపుకోట: పట్టణంలోని విశాఖ –అరుకు రోడ్డులో ఉన్న కుళ్లకోనేరులో పూడికలను సర్పంచ్ సంతోషికుమారి ఆధ్వర్యంలో జేసీబీతో మంగళవారం కొంత వరకు తీయించారు. ఈఓపీఆర్డీ లక్ష్మి, ఈఓ అనూరాధ పనులను పర్యవేక్షించారు.

గణనాథునికి నృత్య నీరాజనం



రామనారాయణంలో నృత్య నీరాజనం చేస్తున్న విద్యార్థులు

విజయనగరం టౌన్: గణపతి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని రామనారాయణం ప్రాంగణంలో శ్రీసూర్య అకాడమీ విద్యార్థులు నృత్య నీరాజనం సమర్పించారు. అకాడమీ ఫౌండర్ టీవీ.రామ్‌కాశ్యప్ ఆధ్వర్యంలో ఐశ్వర్యజ్యోతి బృందం చేసిన నృత్య ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. అనంతరం కళాకారులందరికీ ప్రశంసపత్రాలను, నాట్యగురువులకు సత్కారాలు చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పైడితల్లి మహిమలను చాటిచెప్పాలి



పైడితల్లి అమ్మవారి ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం టౌన్: సిరుల తల్లి పండగ తేదీలు ఖరారయ్యాయి. అమ్మవారి ఉత్సవానికి సంబంధించి ఊరూరా తిరిగి ప్రచారాన్ని నిర్వహించే ప్రచార రథాన్ని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరా జు మంగళవారం ఆలయం వద్ద జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైడితల్లి ప్రజలందరి తల్లి అని, ఆ అమ్మవారి మహిమలను, గొప్పతనాన్ని చాటిచెప్పాలన్నారు. ప్రతీ ఏటా ప్రచార రథం ఉత్తరాంధ్ర అంతా కలియతిరిగి భారీ ఎత్తున ప్రచారం చేస్తుందన్నా రు. అమ్మవారి దీక్షలు చేసే దీక్షాధారులు పెరగాలన్నారు. పైడితల్లి అమ్మవారి పండగను అన్ని శాఖ ల సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర పండగ నేపథ్యంలో అమ్మవారి పండగను ఈ ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సన్నద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముందు ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు నేతృత్వంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు పూ ర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఐ విపి.రాజు, అవనాపు విజయ్, పైడిమాంబ కళాపీఠం వ్యవస్థాపకులు ఆర్.సూర్యపాత్రో, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు పాల్గొన్నారు.